

# బీఆర్ఎస్ రజతోత్సవ సంబురం






## బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు అనుమతి

- ఉత్తర్వులు జారీచేసిన కాజీపేట ఏసీపీ తిరుమల్

వరంగల్, ఏప్రిల్ 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి): భారత రాష్ట్ర సమితి రజతోత్సవ మహాసభకు అనుమతి ఇస్తూ హనుమకొండ జిల్లా కాజీపేట ఏసీపీ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహణ కోసం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మార్చి 28న పోలీసులకు దరఖాస్తు చేశారు. ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ అనుమతి మంజూరులో జాప్యం చేశారు. దీంతో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్ ఈ నెల 9న హైకోర్టును ఆశ్రయించారు. వాదనల అనంతరం ఈ నెల 17లోపు నిర్ణయం తీసుకోవాలని కోర్టు పోలీసు శాఖ ను ఆదేశించింది. ఈ మేరకు బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు అనుమతిస్తూ కాజీపేట ఏసీపీ తిరుమల్ రాత్రివేళ సర్క్యులర్‌ను జారీ చేశారు. దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి అనుమతిపత్రాన్ని తీసుకున్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేస్తాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మల్కాజిగిరి, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎల్కతుర్తిలో జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తున్నామని అన్నారు. ఆదివారం ఉదయం జరగనున్న మల్కాజ్‌గిరి నియోజకవర్గ పార్టీ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరవుతున్నారని తెలిపారు.

# రేవంత్ బ్రాండ్.. ఓట్ ఫర్ నోట్

- రైతు పథకాలకు కేసీఆర్ బ్రాండ్ అంబాసిడర్
- వేగంగా పడిపోయిన కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్ఠ
- ప్రతి ఒక్కరి నోటా సర్కార్ ఫెయిల్ అనే మాటే
- రేవంత్‌రెడ్డి పాలన ఆగం ఆగం, సగం సగం
- రజతోత్సవ సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు



సిద్దిపేటలో రజతోత్సవ సన్నాహక సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 12: సీఎం రేవంత్‌రెడ్డి దేనికి బ్రాండ్ అంబాసిడరో ప్రజలే చెప్తారని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఓట్ ఫర్ నోట్‌కు, పేగులు మేడల వేసుకుంటా అనడంలో, బూతులు మాట్లాడడంలో, లగచర్ల రైతులను జైల్లో పెట్టడంలో, హైడ్రాతో ఇండ్లు కూల్చడంలో, అడవులను నరికేయడంలో.. రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శించారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల సన్నాహక సమావేశం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. సిద్దిపేట పట్టణం, చిన్నకోడూరు మండలాల కార్యకర్తలు పాల్గొన్న ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి ఎంత స్పీడ్‌గా వచ్చిందో, ఎన్నికల తర్వాత ఎగవేతలతో అంతే స్పీడ్‌గా గ్రాఫ్ పడిపోయిందని చెప్పారు. రేవంత్ పాలనా అంతా ఆగం ఆగం, సగం సగం అని విమర్శించారు. రేవంత్‌రెడ్డివి ఉద్దెర మాటలు.. ఉల్టా పాలన అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వాళ్లు కాళ్లలో కట్టె పెడుతున్నారని సీఎం మాట్లాడటంపై మండిపడ్డారు. మహిళలకు రూ.2500, రూ.4 వేల ఆసరా పింఛన్, తులం బంగారం, కేసీఆర్ కిట్, రైతుభరోసా రూ.15 వేలు ఇస్తానని ఇవ్వని ప్రభుత్వాన్ని ఇవ్వాలని నిలదీస్తే కాళ్లలో కట్టెలు పెట్టినట్టా అని విమర్శించారు. 'కేసీఆర్ చెట్లను పెడితే, రేవంత్‌రెడ్డి నరికేస్తున్నాడు. కేసీఆర్ జంగల్ కాపాడిండు.. రేవంత్‌రెడ్డి జంగల్‌ను ధ్వంసం చేస్తుండు.. రామగుండంలో 3 వేల ఎకరాలను కేసీఆర్ కాపాడితే, నేడు రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి అప్పగించారని విమర్శించారు.

### కేసీఆర్ కావాలి.. మళ్లీ రావాలి

కేసీఆరే కావాలి.. మళ్లీ రావాలి.. అని ప్రజలు వేనోళ్లా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అని మరోసారి పునరుద్ఘాటించారు. 24 గంటల కరెంట్, రూ.2 వేల పింఛన్, రైతుబంధు, కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, హరితహారం వంటి పథకాలు, కార్యక్రమాలకు కేసీఆర్ కేరాఫ్ అని, కేసీఆర్ తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ అని కొనియాడారు. వచ్చేది మళ్లీ కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. కేసీఆర్ పెట్టిన బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ సహా ఎన్నింటినో బంద్ చేసి చేసిన రేవంత్ పాలనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. నూకలు మీరే తినుండ్రి అన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నాటి మాటలను నేడు రేవంత్‌రెడ్డి నిజం చేస్తున్నాడని విమర్శించారు. సన్నబియ్యం పేరుతో 40 శాతం నూకలు ఇచ్చి ప్రజలకు తినిపిస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలకు సన్నబియ్యం ఇస్తామని చెప్పి నూకల బియ్యం ఇచ్చిన దౌర్భాగ్యం సీఎం రేవంత్‌రెడ్డిదని హరీశ్‌రావు విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగా నాగిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాముని శ్రీనివాస్, ముల్కల కనకరాజు ఉన్నారు.

## 'స్థానికం'లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు

- అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వర్ధన్నపేట, ఏప్రిల్ 12 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం తప్పదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో శనివారం నిర్వహించిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అబద్ధపు మాటలు చెబుతూ కాలం వెల్లదీస్తున్నాడని విమర్శించారు. 32 మంది ఎమ్మెల్యేలు అధికార పార్టీలోనే వ్యతిరేకంగా ఉన్నారని, ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉన్నందునే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ముందుకు రావడంలేదన్నారు. ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు.

## ప్రతి కార్యకర్త తరలిరావాలి

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



పెబ్బేరు, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి కార్యకర్త తరలిరావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరులో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు.

## కడియం అక్రమాలకు 'దేవునూరే' సాక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్/ చిల్పూర్, ఏప్రిల్ 12: ఎమ్మెల్యే కడియం శ్రీహరి అక్రమాలకు దేవునూరు భూములే సాక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శనివారం ఆయన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్ మండలం లింగంపల్లిలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు నియోజకవర్గం నుంచి 30 వేలకు పైగా జనాన్ని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అటవీ, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ముఖ్యమంత్రి ఎలాంటి హక్కు లేకున్నా రూ.10వేల కోట్లకు 400 ఎకరాల భూములను కుదవపెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఆయన కంటే నేనేం తక్కువ కాదంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు అటవీ భూములను కబ్జా చేస్తున్నాడని విమర్శించారు.

## ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

రజతోత్సవ సభకు కదిలిరావాలి
కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్



కల్వకుర్తి, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ రజతోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలో ఈ నెల 27న ఉదయం పార్టీ జెండాలను ఎగురవేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించగా జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలో మండలానికి ఐదు చొప్పున.. ఏడు మండలాలకు 35 బస్సులు కేటాయించినట్టు తెలిపారు. అదేరోజు ఉదయమే బీఆర్ఎస్ శ్రేణులు గ్రామాల్లో జెండాలు ఎగురవేయాలని కోరారు. అంతకుముందు పార్టీ శ్రేణులతో కలిసి సభ పోస్టర్లను విడుదల చేశారు. ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి నెల పింఛన్ విరాళంగా అందజేస్తున్న దివ్యాంగుడు బ్యాక మల్లయ్య

## బీఆర్ఎస్ సభకు దివ్యాంగుడి విరాళం

కొల్చారం, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఓ దివ్యాంగుడు తన నెల పింఛన్ విరాళం అందజేశాడు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శనివారం ధాన్యం కొనుగోళ్ల కేంద్రం ప్రారంభించడానికి సంగాయిపేటకు వచ్చారు. అనంతరం బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివ్యాంగుడు బ్యాక మల్లయ్య తన నెల పింఛను రూ.4 వేలు ఎమ్మెల్యేకు అందించి కేసీఆర్‌కు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కలను సాకారం చేసిన బీఆర్ఎస్ పార్టీపై మల్లయ్య చూపిన అభిమానాన్ని కొనియాడారు. 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని కోరారు. రంగంపేట నుంచి సంగాయిపేటకు వెళ్తుండగా జోగిపేట–మెదక్ రోడ్డు పక్కన ఓ గోడపై పెయింటర్ బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభ వాల్‌పోస్టర్ వేస్తూ కనిపించగా ఎమ్మెల్యే కారు దిగి పరిశీలించారు. పెయింటర్ బార్డర్ గీసి తెల్ల రంగు వేసి సిద్ధంగా ఉంచిన గోడపై ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి స్వయంగా బ్రష్ చేత పట్టుకుని ' కేసీఆర్ గారి నాయకత్వం వర్ధిల్లాలి', ' చలో వరంగల్' అనే నినాదాలు రాశారు. ఎమ్మెల్యే రాస్తున్నంత సేపు నాయకులంతా ఆసక్తితో పరిశీలించారు.



రజతోత్సవ సభకు హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో రూ.లక్షా116 చెక్కును దాస్యం వినయ్‌భాస్కర్‌కు అందజేస్తున్న త్రిచక్ర సహకార సంఘం బాధ్యులు

## సభను విజయవంతం చేస్తాం

దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ స్పష్టంచేశారు. ఈ నెల 27న జరగనున్న రజతోత్సవ మహాసభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారని చెప్పారు. హనుమకొండ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ 60 లక్షల పార్టీ సభ్యత్వాలు కలిగిన గులాబీ కుటుంబమని చెప్పారు. ఈ సందర్భంగా హనుమకొండలోని త్రిచక్ర పొదుపు, పరపతి పరస్పర సహకార సంఘం రజతోత్సవ సభకు రూ.లక్షా నూటపదహార్ల విరాళాన్ని ప్రకటించింది. సంఘం బాధ్యులు ఆ చెక్కును వినయ్‌భాస్కర్‌కు అందజేశారు. మహాసభకు 800 ఆటోలతో తరలివస్తామని ప్రకటించారు.

## బీఆర్ఎస్ సభతో రేవంత్‌కు భయం

- అందుకే వరంగల్ చుట్టుపక్కల ఆంక్షలు
- ఎన్ని ఆంక్షలు పెట్టినా కేసీఆర్ మీటింగ్‌కు వచ్చే ప్రజలను ఆపలేరు
- మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి



మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి సబితారెడ్డికి పింఛన్ డబ్బులను విరాళంగా ఇస్తున్న వృద్ధులు

షాబాద్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ రజతోత్సవ మీటింగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందని, అందుకే వరంగల్ చుట్టుపక్కల ఆంక్షలు పెట్టారని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. ఈ నెల 27న బీఆర్ఎస్ మీటింగ్ పెట్టుకుంటే కాంగ్రెస్ వాళ్లకు ఇప్పుడే భయం పట్టుకుందని చెప్పారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా కేసీఆర్ మీటింగ్‌కు వచ్చే జనాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ప్రజలను కోరారు.

### పింఛన్ డబ్బులు విరాళం

మొయినాబాద్, ఏప్రిల్ 12: మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లికి చెందిన న్యాలట నర్సమ్మ, న్యాలట యాదమ్మ, న్యాలట పాపమ్మ, మంగళి భిక్షపమ్మలు రజతోత్సవ సభకు చందాగా పెన్షన్ డబ్బులను మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి శనివారం అందించారు. 'పదేండ్ల క్రితం రూ. 200 ఉన్న పింఛన్‌ను కేసీఆర్ సీఎం అయిన తర్వాత రూ. 2 వేలు ఇచ్చిండు. పింఛన్ రూ.4వేలు ఇస్తామని కాంగ్రెసోళ్లు చెప్పడంతో నమ్మి మోసపోయాము. మళ్లీ కేసీఆర్ సారే రావాలి' అని పింఛన్ డబ్బులు విరాళంగా ఇచ్చామని లబ్ధిదారులు సబితారెడ్డికి తెలిపారు.

## బీఆర్ఎస్ సభ పోస్టర్ ఆవిష్కరణ



హుజూరాబాద్, ఏప్రిల్ 12 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని ముఖ్య కూడళ్లలో గోడలపై పోస్టర్లను అంటించారు. సభ విజయవంతమయ్యేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

# జీఎస్టీ వసూళ్లు పెరగకపోవడం ప్రమాదకరం

- రాబడి పెరిగితేనే అభివృద్ధి
- ప్రభుత్వం ఇకనైనా మేల్కోవాలి
- బీఆర్ఎస్ నేత వినోద్‌కుమార్
- 5 డీఏలు ఎక్కడా పెండింగ్‌లో లేవు: దేవీప్రసాద్
- బడ్జెట్ లక్ష్యం నెరవేరడం లేదు: ఆర్థికవేత్త పాపారావు
- ఆర్థిక క్రమశిక్షణ అవసరం: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత వినోద్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, దేవీప్రసాద్, ఎర్రోజు శ్రీనివాస్, తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గత నెల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధిరేటు 'సున్నా'కు చేరడం ప్రమాద సంకేతమని బీఆర్ఎస్ నేత, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ హెచ్చరించారు. రాష్ట్ర రాబడి పెరగకుంటే అభివృద్ధి పనులు చేపట్టడం కష్టమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆదాయం రాకపోతే ఏమీ చేయలేమని పేర్కొంటూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా మేల్కోవాలని, పెట్టుబడిదారులకు భరోసా కల్పించాలని సూచించారు. 'తెలంగాణ ఆర్థిక ప్రగతి–2025–26 బడ్జెట్' అనే అంశంపై శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ, నిర్మాణం కోసం రూ.2–3 లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ అది ఇప్పుడు రూ.30 లక్షల కోట్ల ఆస్తిగా మారిందని చెప్పారు. గత పదేండ్లుగా జీఎస్టీ వసూళ్లలో ఢిల్లీ తర్వాత మన రాష్ట్రమే ముందుండేదని గుర్తుచేశారు. 'హైడ్రా'ను రంగంలోకి దింపి ఇండ్లను కూల్చివేయడంతో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందని, దీంతో ఇండ్లు, ప్లాట్ల క్రయవిక్రయాలు భారీగా క్షీణించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయంతోపాటు ఇతర రాబడి పూర్తిగా తగ్గిపోయిందని తెలిపారు. తెలంగాణ దివాలా తీసిందని సీఎం రేవంత్‌రెడ్డే ప్రకటిస్తే ఇక రాష్ట్రానికి ఎవరు అప్పు ఇస్తారని ప్రశ్నించారు.

### వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్

వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ ఉండాలని ఆర్థిక నిపుణుడు పులి రాజు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని రైతుల్లో 88% మంది అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రాబడిలో 60% రెవెన్యూ ఖర్చులకే పోతున్నాయని, సంక్షేమానికి 40% నిధులు మాత్రమే మిగులుతున్నాయని ప్రొఫెసర్ కే సీతారామారావు చెప్పారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో కేటాయింపులు జరపాలని ప్రొఫెసర్ రమణమూర్తి సూచించారు. బడ్జెట్ పదాలను బ్రహ్మ పదార్థంలా జటిలంగా, అర్థంకాని విధంగా మార్చేశారని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణకుమార్ పేర్కొంటూ.. వాటిని సరళీకరించాలని, సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా బడ్జెట్‌ను రూపొందించాలని స్పష్టం చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడు శోభన్, ప్రొఫెసర్ సదానందం, ప్రొఫెసర్ చిట్టెడి కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ రమణమూర్తి, దయాకర్, యాదగిరి పాల్గొన్నారు.

### రూ.20 వేల కోట్ల బకాయిలు: దేవీప్రసాద్

రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులకు దాదాపు రూ.20 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాల్సి ఉన్నదని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

### వేల కోట్లు ఎటు పోతున్నాయ్: మల్లారెడ్డి

ప్రతి సంవత్సరం బడ్జెట్, సబ్‌ప్లాన్ కలిపి ఎస్సీలకు దాదాపు రూ.75 వేల కోట్ల కేటాయిస్తున్నప్పటికీ వారు ఎందుకు అభివృద్ధి చెందడం లేదని సీపీఎం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి ప్రశ్నించారు. పన్నేతర రాబడులపై ప్రభుత్వం వేసిన అంచనాలో సగం కూడా రాకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతోపాటు వ్యవసాయం, గ్రామ పంచాయతీలకు నిధుల్లో కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

### లోటు ఎలా భర్తీ చేస్తరు: పాపారావు

గత బడ్జెట్‌లో రూ.71 వేల కోట్లు ఖర్చు చేయలేకపోయారని, అయినప్పటికీ ఈసారి అంచనా పెంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని రాజకీయ, సామాజిక విశ్లేషకుడు డీ పాపారావు గుర్తుచేశారు. ఆ లోటును ఏవిధంగా పూడ్చుతారో, రాష్ట్ర రాబడిని ఎలా పెంచుతారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. ప్రాధాన్యతల ప్రకారంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలని సూచించారు.

### తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యం

ఉద్యమకాలంలో కీలకంగా పనిచేసిన బుద్ధిజీవులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యావంతులు అంతా కలిసి ఈ వేదికను ఏర్పాటు చేసుకున్నాం. ఉద్యమ ఆకాంక్షలు నెరవేరేలా చూసేందుకు మా వంతు ప్రయత్నిస్తున్నాం. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషిచేస్తున్నాం. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆ క్రమంలోనే ఇప్పుడు సమావేశాన్ని ఏర్పాటు చేశాం.

-డాక్టర్ ఎర్రోజు శ్రీనివాస్, సమన్వయకర్త తెలంగాణ వికాస సమితి

### నిధులు పెరగాలి: అద్దంకి దయాకర్

విద్య, వైద్య రంగాలకు నిధులను భారీగా పెంచాల్సిన అవసరం ఉన్నదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అభిప్రాయపడ్డారు. నిధులు కేటాయించినప్పటికీ వాటిని ఖర్చు చేయకపోతే లాభం ఏమిటని ప్రశ్నించారు. గ్రామీణ, నగర ప్రజల ఆకాంక్షలు, అవసరాలు వేర్వేరుగా ఉంటాయని, తదనుగుణంగా నిధులు కేటాయింపు జరగాలని స్పష్టం చేశారు.

### మూలధన వ్యయం పెరగాలి: కాసం

ప్రతి బడ్జెట్‌లో పద్దులను పెంచడమే తప్ప మూలధన వ్యయం పెరగడం లేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఆక్షేపించారు. రాష్ట్ర రాబడిలో మూలధన వ్యయం 32 నుంచి 40 శాతం మేరకు ఉండాలని సూచించారు. చాలా వర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## కాగితాలకే పరిమితమైన సంక్షేమం


భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



రేగొండ, ఏప్రిల్ 12 : ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి.. కాగితాలు, శిలా ఫలకాలు, ఎమ్మెల్యేల టూర్లకే పరిమితమయ్యాయని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో మండలంలోని రూపిరెడ్డిపల్లె, దమ్మనపేట, రాయపల్లె, కనిపర్తి, నాగుర్లపల్లి, రేపాక, మడుత్తపల్లి, పొనగల్లు గ్రామాల్లో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2028లో కారు సర్కారు రావడం ఖాయమని, అందుకు వరంగల్ సభ నాంది అవుతుందని చెప్పారు. 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ సభకు భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు.

## వేలాదిగా తరలిరావాలి

నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 12 : ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 3 వేలకుపైగా అభిమానులను తరలించాలన్న ఉద్దేశంతో 25 బస్సులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అంతకుముందు చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరించారు.